క్లుప్తంగా

నేటి నుంచి వెంపడాంలో పైడితల్లి పండగ



వెంపడాం పైడితల్లి అమ్మవారు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 20న తొలేళ్ల మహోత్సవం, 21న అంజలి రథోత్సవం, 22న కనుమ పండగ నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలివస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యుత్ కాంతులతో పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

హెచ్ఐవీ మృతులకు నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

భోగాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రధాన వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఐవీతో చనిపోయిన వారికి నివాళి అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ కె.శాలిని, సెంటర్ కౌన్సిలర్ పుష్పరావు, లేబరేటరీ ఇన్‌చార్జ్ రామకృష్ణ, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి: సీఐ



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రామారావు

విజయనగరం క్రైమ్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలందరూ వివాదాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ కోరాడ రామారావు సూచించారు. స్థానిక ఫూల్‌బాగ్, దాసన్నపేట, గాజులరేగ, రాజీవ్‌నగర్ కాలనీల్లో ఆదివారం సాయంత్రం స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలు పూర్తయినప్పటికీ ఫలితాలు వచ్చేవరకు కోడ్ అమల్లో ఉంటుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏసు ప్రేమాలయంలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు విశ్వాసకులు

విజయనగరం టౌన్: ప్రభువైన యేసుక్రీస్తు ఆశీర్వాదాన్ని ప్రతి ఒక్కరూ ప్రార్థన ద్వారా పొందాలని స్థానిక అంబటిసత్రం వద్ద ఉన్న ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్చి ఆవరణలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచశాంతి, సౌభ్రాతత్వం వర్ధిల్లాలని, ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు, మానసిక ప్రశాంతత, ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో విన్‌స్టన్, సువర్ణమ్మ, ఝాన్సీ, సుజన్, కీర్తి, నాగేశ్వరరావు, విక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్‌ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సిబ్బంది

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ శిబిరంలో 94 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరందరికీ విశాఖ పట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయించనున్నామని శంకర్ ఫౌండే షన్ ప్రతినిధులు సీహెచ్.వెంకటరమణ, పవిత్ర తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో
బహుళ ప్రయోజనాలు



చౌడువాడలో వేసవి దుక్కులు చేస్తున్న రైతులు

- ఖరీఫ్, రబీ సీజన్లలో ఒకే పంట సాగు చేస్తే నష్టాలే..
- పంటమార్పిడి భూముల్లో సేంద్రియ పదార్థాలు గణనీయంగా వృద్ధి
- ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడిలో పెరుగుదల

పూసపాటిరేగ: ఒకే భూమిలో ఒకే రకమైన పంటను పదేపదే సాగు చేయడం వల్ల క్రమంగా దిగుబడులు తగ్గిపోతాయి. పంటల్లో ఎదుగుదల లేకపోవడంతో పాటు చీడపీడల సమస్య పెరుగుతుంది. ఇటువంటి ప్రతికూలతలను అధిగమించేందుకు పంటల మార్పిడి విధానం ఎంతో మేలు. వేరువేరు పంటలను సాగు చేయడం వల్ల ప్రకృతి వనరులను సమర్థవంతంగా వాడుకోవడంతో పాటు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పంటల మార్పిడి విధానంపై వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ రైతులకు పలు సూచనలు అందించారు.

ఒకే పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలు

- ఏటా ఒకే రకమైన పంటను పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు సరిగా ఎదగకపోవడంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతుంది.
- ఒకే భూమిలో ఒకే పంట సాగు చేయడం వల్ల వేరు వ్యవస్థ ఒకే లోతుకుపోతుంది. దీని వల్ల భూమిలో అక్కడ వరకు ఉన్న పోషకాలు మాత్రమే మొక్కలు వినియోగించుకోగలుగుతాయి. సరైన పోషకాలు అందక పంట దిగుబడులు తగ్గుతాయి.
- నేల కోతకు గురై పండించిన పంటలో నాణ్యత లేక నాసిరకంగా ఉంటుంది. ఫలితంగా గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు నష్టపోతారు.
- ఒకే పంట సాగు వల్ల మార్కెటింగ్ సమస్యలు ఎదురవుతాయి. నాణ్యత తగ్గి మార్కెటింగ్ కష్టం అవుతుంది.

పాటించాల్సిన అంశాలు

- ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయే వేరు వ్యవస్థ ఉన్న పంట, తక్కువ లోతుకు చొచ్చుకుపోయే వేళ్లున్న పైరు ఒకదాని తరువాత ఒకటి సాగు చేసినట్లయితే భూమిలో సేంద్రియ పదార్థాలు పెరగడంతో భూమి సారవంతంగా ఉంటుంది.
- నేలను నిర్వీర్యం చేసే పంటలు, సారాన్ని అభివృద్ధి చేసే పంటలు ఒకదాని తరువాత ఒకటి సాగు చేయాలి. ఒక సీజనులో మొక్కజొన్న వేసినట్లయితే మరో సీజనులో వేరుశనగ, అపరాలు మొదలగు పంటలు వేయాలి. దీని వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- వరి సాగు చేసిన తరువాత అపరాలు, మొక్కజొన్న మొదలగు పంటలు వేసినట్లయితే భూమిలో సారం పెరుగుతుంది.
- వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుమ మొదలగు పంటలు వేసినట్లయితే భూమిలో నత్రజని శాతం పెరగడంతో భూమి సారవంతంగా మారుతుంది.

పంటలు మార్చి సాగు చేయాలి



జిల్లాలో అత్యధికంగా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు మొక్కజొన్న పంటనే సాగు చేస్తున్నారు. దీనివల్ల భూములు సారం తగ్గిపోతుంది. దీంతో పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోయి సరైన గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతారు. కొంత మంది రైతులు ఖరీఫ్‌లో, రబీలో కూడా వరిపంట వేస్తున్నారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుంది. వీలైనంత వరకు పంటలను మార్చి సాగు చేయాలి. దీని వల్ల రైతులకు మేలు జరుగుతుంది.

– కొల్లి నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

అన్నమయ్య జయంతి వేడుకలకు సర్వం సిద్ధం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: అన్నమయ్య వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు తెలిపారు. కార్యాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త నిర్వహణలో ఈ నెల 23న సాయంత్రం 6 గంటల నుంచి గురజాడ కళాభారతి వేదికగా అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆకర్షణగా భక్తుల సందర్శనార్థం 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని వేదికపై ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వర్ధమాన గాయనీ, గాయకులతో అన్నమయ్య భజన కీర్తనలు, ఇండియన్ ఐడల్ ఫేమ్ పవన్‌కుమార్‌తో ప్రత్యేక సంగీతాలాపన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంగీతాభిమానులు, భక్తులు అందరూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గ్రంధి విష్ణుమూర్తి, వైవీవీ సత్యనారాయణ, ధవళ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అడ్మిన్స్ట్రేట్ ఆఫీసర్ దాసరి బంగారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని బుధ రాయవలస ఎస్ఐ బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయ న విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాని, అభిమానులు కాని ఎవరైనా ఎన్ని కల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లకు పాల్పడినా, గొడవలకు దిగినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చెప్పారు.

అమలు కాని నిషేధం..
ఆగని ప్లాస్టిక్ వినియోగం

- కార్పొరేషన్ పరిధిలో యథేచ్ఛగా ప్లాస్టిక్ సంచుల విక్రయాలు, వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- పర్యావరణానికి తీవ్ర ముప్పు



గుణుపూరుపేట డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

విజయనగరం: పాలిథిన్ సంచుల వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతోందని భావించిన ప్రభుత్వం పాలిథిన్ సంచుల వినియోగాన్ని నిషేధించింది. పాలిథిన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించింది. అయినా నిషేధం అమలు కావడం లేదు. ప్రజల్లో మార్పు రాలేదు. నగరంలో పాలిథిన్ వినియోగం పెరుగుతోంది తప్ప తగ్గడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ నుంచి కూరగాయలు, కిరాణా సరుకులు ప్లాస్టిక్ సంచుల్లో తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. మరో వైపు హోటళ్లు, కర్రి పాయింట్ల నుంచి వేడి ఆహార పదార్థాలు, కూరలు, సాంబారు, ఛాయ్, కాఫీలను పాలిథిన్ కవర్లలో తీసుకొచ్చి తమకు తెలియకుండానే తమ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు.

నిషేధంపై నిర్లక్ష్యం..

2022 జులైలో 75 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించగా.. డిసెంబరులో 121 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ ఆదేశాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొక్కుబడిగా ఒకటి రెండు సమావేశాలు నిర్వహించి ఇక బాధ్యత తీరి పోయిందని మళ్లీ అటు వైపు దృష్టి సారించక పోవడంతో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం కొనసాగుతోందని పలువురు అంటున్నారు. అధికారుల తనిఖీలు, జరిమానాలు నామ మాత్రమే అయ్యాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి రోజు 125 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా.. అందులో 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నట్లు సమాచారం.

మారితేనే సాధ్యం..

పాలిథిన్ నిషేధంపై అధికారులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి ఉద్యమంలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముంది. ప్లాస్టిక్ ప్రభావంతో జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి. దుకాణదారులు, హోటళ్ల యజమానులు, కూరగాయలు, పండ్ల విక్రేతలతో అధికారులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలి. ప్రతి ఒక్కరిలో మార్పు రావాలి. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కషి చేయాలి.

పేపర్ టీకప్పులు, విస్తరాకులపై పలుచని పాలిథిన్ పొర ఉంటుంది. వేడి పదార్థాలు వేసినప్పుడు ఆ పొర కరిగి మనం తీసుకనే పదార్థంలో కలిసి కడుపులోకి చేరి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. వేడి పదార్థాలు, పాలు, పెరుగు వంటి వాటికి డబ్బాలు, గిన్నెలు భోజనానికి పళ్లాలు వినియోగించాలని సూచిస్తున్నారు.



ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తున్న దృశ్యం

పాపం.. పశువులు..

కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులను, విస్తరాకులను నిర్లక్ష్యంగా పడేయడంతో పశువులు వాటిని తినేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు జీర్ణం కాక అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల పశువైద్యులు పశువులకు శస్త్రచికిత్సలు చేసి కిలోల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలను తీసి ప్రాణాలు కాపాడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మానవ తప్పిదాలు మూగజీవాల పాలిట శాపంగా మారకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యామ్నాయం వైపు ప్రజలు అలవాటు పడేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇందు కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నాం. ఇదివరకు తనిఖీలు చేపట్టి పలువురికి జరిమానాలు విధించాం. నిషేధిత ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పిస్తాం. పాలిథిన్ సంచులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తాం. వ్యాపారులు గమనించి సహకరించాలి.

– ఎం.మల్లయ్యానాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడు



డెంకాడ: పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎం కార్యాలయంపై జెండా ఎగురవేస్తున్న పార్టీ నాయకులు

డెంకాడ: కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య సేవలు ఆదర్శనీయమని, ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని అక్కివరం హేచరీ వద్ద సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుల వ్యవస్థ నిర్మూలనకు ఆయన పేరులో ఉన్న రెడ్డిని తొలించారని, విద్యార్థి దశ నుంచే ఆదర్శ భావాలు కలిగిన సుందరయ్య 17వ సంవత్సరంలోనే స్వాతంత్ర్యోద్యమంలో చేరి అరెస్టు అయ్యారని గుర్తుచేసుకున్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.నర్సినాయుడు, ఏ.సూర్యనారాయణ, పెటరాజు, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

- **విజయనగరం ఫూల్‌బాగ్:** కమ్యూనిస్టు నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రామకృష్ణానగర్, ఎల్‌బీజీ నగర్, వినాయకనగర్, సుందరయ్య కాలనీ, గురాజాడ నగర్, ముచ్చెరువుగట్టు కాలనీల్లో సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు పార్టీ పతాకాన్ని ఎగురువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శాంతమూర్తి, జగదాంబ, రమణ, పుణ్యవతి, జగన్మోమోహన్, లక్ష్మి, శ్రీను, సన్యాసిరావు, సంతోష్, మూర్తి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడితల్లి దేవర మహోత్సవం



పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మేళతాళాలతో, భాజా భజంత్రీలతో అమ్మవారిని ఊరేగింపుగా హుకుంపేటలో ఉన్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటివద్దకు తరలిస్తామన్నారు. అక్కడ నుంచి అదేరోజు రాత్రి పెద్దచెరువు పశ్చిమభాగాన పూజారి, తలయారులు, జాలరులతో కలిసి అమ్మవారికి మనవి చెప్పి ఘటాలను తీసుకొస్తామన్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారు చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. నాటి నుంచి పైడితల్లి అమ్మవారి జాతర ముగింపు ఉయ్యాల కంబాల మహోత్సవం వరకు అమ్మవారు చదురుగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు. దేవర మహోత్సవంలో భక్తులందరూ పాల్గొని, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

• విరబూసిన మే పుష్పాలు



విజయనగరం రూరల్: నగరంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో మే పుష్పాలు విరబూయడంతో వాటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. రెండు కుండీల్లో ఈ మొక్కలు నాటగా.. ఒక మొక్కకు 9 పుష్పాలు, మరో మొక్కకు 6 పుష్పాలు విచ్చుకున్నాయి. స్టేడియంకు వచ్చేవారంతా వాటిని ఆసక్తిగా చూస్తున్నారు. ఏడాదిలో మే నెలలో మాత్రమే ఈ పుష్పాలు విరబూస్తాయి కనుక వీటిని మే పుష్పాలుగా పిలుస్తారు.

వైశాఖ ఏకాదశి పూజలు



గాయత్రీదేవి ఆలయంలో శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న దంపతులు

శృంగవరపుకోట: వైశాఖమాసం, ఏకాదశి కావడంతో ఆదివారం ఎస్.కోట పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవీ జంక్షన్‌లో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీరమా వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పలువురు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



దేవి జంక్షన్‌లోని గణపతి ఆలయంలో సత్య నారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆదిత్యునికి పూజలు

పుణ్యగిరి రోడ్డులోని సూర్యదేవాలయంలో ఛాయా, ఉషా, పద్మిని సమేత సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు చేసిన అనంతరం అర్చనాధి కార్యక్రమాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణచేశారు.

శ్రీనివాస కల్యాణం

ఎస్.కోట పట్టణంలోని విశాఖ-అరుకు రోడ్డులో ఉన్న గాయత్రీదేవి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి,భూదేవి,సమేత కల్యాణ వెంక టేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను మండపంలో వేదికపై ఏర్పాటు చేసి, సర్వాంగ శోభితంగా అలంకరించి, ఆలయ పురోహితుడు కల్యాణం చేయించారు.పట్టణానికి చెందిన భక్తులు కల్యాణ కర్తలుగా వ్యవహరించి స్వామివారి పెళ్లి జరిపించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.